క్లుప్తంగా

'చలో ఉట్నూర్' విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజనులు

తాంసి: జనవరి 20న చేపట్టిన చలో ఉట్నూర్ మహాధర్నాను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం భారత్ కోరారు. శుక్రవారం అంబుగాం గ్రామంలో గిరిజనులతో కలిసి మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట మహాధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన పెద్దలు శేఖర్, పాచ్చిరాం, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ, నర్సాపూర్ 33 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇచ్చోడ ట్రాన్స్‌కో ఏఈ రాజు తెలిపారు. రెండు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమావేశాన్ని ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేణికుంట సురేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఐదుగురు చొప్పున బాధ్యులు వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగుడికి చేయూత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలో గల నిరాశ్రయుల కేంద్రంలో ఉంటున్న దివ్యాంగుడికి న్యూ రెయిన్ బో వెల్ఫేర్ సొసైటీ చేయూతనందించింది. శుక్రవారం దివ్యాంగుడైన శ్రీనివాస్‌కు ఆ సంస్థ ద్వారా స్టాండ్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ నిరాశ్రయుల కేంద్రంలో ఎవరికైనా సహాయం అవసరముంటేనే తమను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సూర్య ప్రసాద్, పోశెట్టి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పూసం సచిన్, లంక రాఘవులు, మెట్టు ప్రహ్లాద్, అశోక్ స్వామి, విఠల్, వినోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.


ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

తాంసి: భీంపూర్ మండలంలోని గిరిజన గ్రామాల్లో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండలంలోని గుంజాల, భీంపూర్, భగవాన్‌పూర్, శాంతినగర్ గ్రామాల్లో డీపీఆర్‌వో ఆదేశాల మేరకు ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. జాతీయ ఆరోగ్య మిషన్, డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు వెంకట్రావు, రమేశ్, రాజలింగు, మురళీ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: రక్తహీనతతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేరిన మహారాష్ట్రంలోని చంద్రపూర్ మండలం బామిని గ్రామానికి చెందిన శాంతాబాయి అనే మహిళకు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రుపేష్‌రెడ్డి చొరవతో రక్తం లభించింది. బి–పాజిటివ్ రక్తం అవసరమనే వైద్యుల సూచన మేరకు బాధితురాలి కుటుంబీకులు రూపేష్‌రెడ్డిని ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన ఆయన బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన ముఖ్య సతీష్ అనే యువకుడిని రిమ్స్ బ్లడ్‌బంక్‌కు తీసుకువచ్చి రక్తదానం చేయించారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా భిక్షపతి



రాథోడ్ భిక్షపతి

నార్నూర్: బీజేపీ మండలాధ్యక్షుడిగా మండల కేంద్రంలోని ఇందికానగర్‌కు చెందిన రాథోడ్ భిక్షపతిని కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి పార్టీని నిర్మాణం చేస్తామన్నారు.

దుమ్ము లేస్తోంది..!

- లాండసాంగ్వి గ్రామంలో పూర్తికాని రోడ్డు పనులు
- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



వాహనాలతో లాండసాంగ్వి గ్రామంలో లేస్తున్న దుమ్ము

ఆదిలాబాద్‌రూరల్: జైనథ్ మండలంలోని తరోడ గ్రామ సమీపంలోని వంతెన గతంలో కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో అటు వైపు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా వాహనాలను దారి మళ్లించారు. లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్లే రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్పందించిన ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

దుమ్ముతో ఇబ్బందులు..

లాండసాంగ్వి గ్రామం మీదుగా నిరాల వరకు 14.1 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం రూ. 40.24 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే లాండసాంగ్వి గ్రామం ప్రారంభం నుంచి గ్రామం చివరి వరకు రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుంది. రోడ్డుకు అనుకోని ఇరువైపులా ఇళ్లు ఉండడంతో అటు వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాల దుమ్ము తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న, వృద్ధాప్యంలో ఉన్న వారు రోడ్డుపై నుంచి లేచి దుమ్ముతో మరింత అనారోగ్యాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో నీళ్ల పట్టించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనుల్లో జాప్యం..

రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ లాండసాంగ్వి గ్రామంలోని పాత బీటీ రోడ్డుపై ఉన్న కాంక్రీట్‌ను తొలగించి, కొత్త బీటీ రోడ్డు నిర్మాణం కోసం కాంక్రీట్, మొరం వేశారు. 14.1 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణంలో సుమారు 13.5 కిలో మీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, లాండసాంగ్వి గ్రామంతో పాటు నిరాల గ్రామంలో కలిపి మిగితా 600 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులు ఆయా గ్రామస్తులు ఆ సందర్భంలో అభ్యంతరం వ్యక్తం చేయడంతో జాప్యం జరిగిందన్నారు.

పనులు ప్రారంభమయ్యాయి

ఆదిలాబాద్ జాతీయ రహదారి నుంచి జైనథ్ మండలం నిరాల వరకు లాండసాంగ్వి గ్రామం మీదుగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో లాండసాంగ్వి గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుంది. వాటిని మార్చిలోగా పూర్తి చేస్తాం.

– సుభాష్, ఎస్‌హెచ్, డిప్యూటీ ఈఈ

యువత క్రీడల్లో రాణించాలి



నగదు అందజేస్తున్న నాగోరావు, సభ్యులు

తాంసి: గ్రామాల్లో నిర్వహించే క్రీడ పోటీల్లో యువత రాణించాలని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెస్రం నాగోరావు అన్నారు. భీంపూర్ మండలంలోని మార్కగూడలో మూడు రోజులుగా రాంజీ గొండ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. మహారాష్ట్ర కిన్వట్‌కు చెందిన సేవాక్లబ్ జట్టు మొదటి బహుమతి రూ.21,000, రెండో బహుమతి వైజాపూర్ రూ.15,000, మూడో బహుమతి రూ.10,000 డోంగ్రగావ్ జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, యూత్ సభ్యులు బండు, సోమేశ్వర్, నాగో రావు, కుడ్మేత గంగారం, రవీందర్, శంకర్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కనుగుట్ట గ్రామస్తులు నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను వివరించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వైకుంఠధామం వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నవ్వ రవీందర్, మునిగెల రమేశ్, భీమ బుచ్చన్న, నవ్వ రాజు, బోడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



పనులు ప్రారంభిస్తున్న అధికారులు

నార్నూర్: తొడసం వంశీయుల ఆరాధ్యదైవం ఖండేవ్ ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు శుక్రవారం ఎంపీడీవో జవహర్, ఎస్‌బీఎం రాథోడ్ సందీప్‌లు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 3 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సురేశ్, టీఏలు జాదవ్ కైలాస్‌నాయక్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

19న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: మావల మండలంలోని ఓ గార్డెన్‌లో ఈనెల 19న ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు కొత్తవార్ రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వధూవరుల పరిచయం, సాయంత్రం 4 గంటల నుంచి పునర్వివాహం చేసుకునే వారికి పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

కనుగుట్టలో టీబీ పరీక్షలు



టీబీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు వైద్య సిబ్బంది టీబీ పరీక్షలు చేశారు. గ్రామంలో 50 మందికి పరీక్షలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ సుధ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు దేవిదాస్, సంధ్య, హెచ్‌ఈ యశోద, రవీందర్, దేవిదాస్, అలేఖ్య, పావని, గోవర్ధన్, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్‌తండాలో శుక్రవారం స్థానిక ఎస్సై దుబ్బక సునీల్ ఆధ్వర్యంలో గ్రామ యువత, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. గ్రామీణప్రాంత యువత నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై పీర్‌సింగ్, పోలీసు సిబ్బంది మోహన్, హర్కపూతండా యువకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని కుప్టి(కె)ను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కుప్టి (కె), గాంధారి గ్రామాలను గ్రామ ప్రజలు మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని మోమీన్‌పుర కాలనీలోని మదీన మసీద్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్ ఇమ్రాన్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అతీక్, కార్యదరిగా అంజత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మజర్ ఖాన్, మహమ్మద్ సలీం, జాహెద్ హుస్సేన్, ఫరూక్, అమీర్, రఫీక్ ఖాన్, అలీం, ఇమ్రాన్, మోసీన్, జాహెద్ యాఫై, అబ్దుల్ మతీన్ తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్

నార్నూర్: మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన చౌహాన్ కృష్ణ పోలీస్ కానిస్టేబుల్ నార్నూర్ మండలంలోని పేద విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్నూర్, భీంపూర్, మహాగావ్, రాజులగూడ గ్రామానికి చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫైర్ స్టేషన్ లేని కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తులు కాలి బూడిదవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయకపోతే ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కొండమడుగు గణేష్, భిక్క రమేశ్, కుందూరు సుధాకర్, పెందూరు జల్‌దేవ్ పాల్గొన్నారు.

49 సభలు.. 98 మంది ఉద్యోగులు

- బల్దియా వార్డుసభల షెడ్యూల్ ఖరారు
- ఐదు వార్డులకో పర్యవేక్షణాధికారి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం మున్సిపల్ పరిధిలో ఈ నెల 21నుంచి వార్డు సభలు నిర్వహించనున్నారు. మూడు రోజుల్లో వీటిని పూర్తి చేసేలా ఆదిలాబాద్ మున్సిపల్ అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రతీవార్డు పరిధిలో వార్డుసభ నిర్వహించనుండగా ఒక్కోసభకు ఇద్దరు ఉద్యోగులను నియమించారు. వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, శానిటరీ జవాన్లు, జూనియర్, సినియర్ అసిస్టెంట్లు, ఆర్‌ఐలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఒక్కోవార్డుకు ఇద్దరు చొప్పున అన్ని కేటగిరీల నుంచి 98 మందిని నియమించారు. ప్రతీ వార్డులో ఉదయం మధ్యాహ్నం సమయాల్లో సభలు నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. అలాగే వార్డు సభలను పర్యవేక్షించేందు కోసం ఐదుగురు అధికారులను నియమించారు. పట్టణంలోని 10,17,18,48 వార్డులకు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, 1,2,3,4,5,9 వార్డులకు ఈఈ తిరుపతి, 6,16,35,41,44 వార్డులకు సీనియర్ అకౌంటెంట్ జి.శ్రీనివాస్, 7,26,27,29,30 వార్డులకు మెప్మా డీఎంసీ కె.శ్రీనివాస్, 21,22,23, 25,42 వార్డులకు టీపీఎస్ కె.నవీన్ కుమార్, 19,20,28,46,47 వార్డులకు మున్సిపల్ అకౌంట్ ఆఫీసర్ బి.రాజ్ కుమార్, 14,36,39,40,43 వార్డులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శంకర్, 31,32,33,37,38 వార్డులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.నరేందర్, 8,24,45,49 వార్డులకు డీఈ కార్తీక్, 11,12,13,15,34 వార్డులకు మున్సిపల్ రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ పర్యవేక్షణాధికారులుగా వ్యవహరించనున్నారు. వీరితో పాటు ఆయా వార్డు కౌన్సిలర్లు సైతం వార్డు సభల్లో పాల్గొననున్నారు.

మహిముద్‌ఖాన్ కుటుంబానికి అండగా ఉంటాం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఇచ్చోడ: కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన మహిముద్‌ఖాన్ కుటుంబాన్ని శుక్రవారం ఆమె పరామర్శించి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహిముద్‌ఖాన్ పార్టీకి సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆమె వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఆత్రం సుగుణ, తదితరులు ఉన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: పేదలకు సేవ చేయడమే లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని జెండాగూడ, మొర్రిపేట్, శివగూడ గ్రామాలలోని కొలాం, నాయక్‌పోడ్ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలలో పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని పేదలకు, నాయకపోడు గిరిజనులకు తమవంతుగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావు, ఆర్టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, ఖయ్యుం, ఎక్బాల్, భీమన్న, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతాం..

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ. 20 లక్షల వేయంతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైయినేజీ పనులకు భూమి పూజ చేశారు. ప్రతీ గ్రామంలో రోడ్డు, డ్రైయినేజీ, నీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పక్కగా అమలు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

ఎదులాపురం: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మూడోవ మహాసభ నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ నుంచి బ్యాండు మేళాలతో మహాసభ స్థలం వరకు ర్యాలీగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా చట్టాలను తీసుకొస్తున్నాయన్నారు. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా మున్సిపల్ కార్మికులు పని చేయడం జరుగుతుందని. నగర పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. అలాంటి వారికి ప్రభుత్వాలు గుర్తించకపోవడం బాధకరమన్నారు. వేతనాలను పెండింగ్‌లో ఉంచకుండా నెల నెల అందించాలన్నారు. ఇందులో ఏఐటీయూసీ నాయకులు సిర్ర దేవేందర్, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సంక్షేమం దిశగా..

బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం దిశగా అనేక కార్యక్రమాలు చేపటిందని మాజీ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మూడో మహాసభ ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండాలని అప్పుడు సమస్యలను సాధించుకోవడం సాధ్యమవుతుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరుతున్న వసంత్ రావ్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో కుంటాల గ్రామానికి చెందిన మాజీ బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోత్ వసంత్ రావు వేణుగోపాల్ చారి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువతీ, యువకులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది దళారులు గ్రూప్-4, ఏఈఈ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇద్దరు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పేరిట మోసం చేసే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన కోరారు.